చేపా.. చేపా.. ఎండేదెట్టా!

- శిథిలమైన ప్లాట్‌ఫారాలు
- ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు



తీరంలో శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాలు ప్లాట్ ఫారం



రోడ్డుపై ఎండబెట్టిన ఎండు చేపలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం మత్స్యకారులు వేటాడి తెచ్చిన చిరు చేపలు ఎండబెట్టడానికి అవసరమైన ప్లాట్ ఫారాలు శిథిలం అయ్యాయి. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు నిత్యం చేపల వేట సాగిస్తారు. వీరి వలలకు చిక్కిన చిరు చేపలకు సరైన గిట్టుబాటు ధర లభించక పోతే వాటిని ఎండబెట్టి వివిధ ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయించి సొమ్ము చేసుకుంటారు. అయితే మత్స్యకారులు చిరుచేపలు ఎండబెట్టడానికి తీరంలో కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాలు ప్లాట్ ఫారం దెబ్బతింది. మరో రెండు ప్లాట్ ఫారాలు కూడా మరమ్మతులకు గురయ్యాయి. అలాగే వలలు, ఇంజిన్లు వేట సామగ్రి భద్రపర్చుకోవడానికి నిర్మించిన కమ్యూనిటీ భవనం కూడా శిథిలావస్థకు చేరింది.

వేధిస్తున్న స్థల సమస్య

ప్లాట్ ఫారాలు శిథిలం కావడంతో ఉన్న ఒకే ప్లాట్ ఫారంపై అంతా చిరు చేపలు ఎండబెట్టడానికి వీలు కాక ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకార్మికులు చెబుతున్నారు. ప్లాట్ ఫారాలకు మరమ్మతులు చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. వేరే మార్గం లేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా రోడ్లపై చేపలు ఎండబెడుతున్నామని చెబుతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న ప్లాట్ ఫారాల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శానాపతి వసంత

సింహాచలం: మహిళలు అన్ని రంగాల్లో ప్రగతి సాధించి ఆదర్శంగా నిలవాలని 97వ వార్డు కార్పరేటర్ శానాపతి వసంత అన్నారు. వార్డు పరిధిలోని వెంకటాద్రినగర్ మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు పలు విభాగాల్లో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. టైలరింగ్, గ్లాస్ పెయింటింగ్, మగ్గం వర్కు, క్యాండిల్ మేకింగ్, బేకరి ఐటమ్స్ తయారీలో తమ ప్రావీణ్యాన్ని పొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు రాజేశ్వరి, జయశ్రీ, కృష్ణవేణి, కాలనీ నిర్వాసితులు పాల్గొన్నారు.

పరవాడ మండల సమావేశం నేడు

పరవాడ: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వి.హేమసుందర్రావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో హేమసుందర్రావు కోరారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సబ్బవరం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్-2 అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గుల్లేపల్లి రూరల్ ఫీడర్‌లోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు ఈపీడీసీఎల్ డిప్యూటీ ప్రాజెక్టు ఇంజినీర్ బి. నిరంజన్ అంబేడ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెక్షన్-2 పరిధిలోని అంతకాపల్లి సబ్‌స్టేషన్-33/11 కేవీతో పాటు గుల్లేపల్లి రూరల్ ఫీడర్-11కేవీ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపోనున్నట్లు పేర్కొన్నారు. గుల్లేపల్లి,మొగలిపురం,మల్లునాయుడుపాలెం,బోదువలస,ఎల్లుప్పి,అయ్యన్నపాలెం,దుడ్డువాక,కిల్లివానిపాలెం,రాపర్తివానిపాలెం,మ్రిపాలెంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

పాడి రైతుల ఆదాయం పెంపునకు కృషి



మాట్లాడుతున్న స్మైల్ అడిషనల్ డైరెక్టర్ సింహాచలం

ఆరిలోవ : పాడి పశువుల ఉత్పాదకత పెంపుదలకు కృషి జరుగుతోందని రాష్ట్ర పశుగణ వ్యవస్థాపక యాజమాన్య సంస్థ (స్మైల్) అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యాండ్రపు సింహాచలం తెలిపారు. విమ్స్ సమీపంలోని రాష్ట్ర స్మైల్ కార్యాలయంలో అన్ని జిల్లాలలో ఉన్న వెటర్నర్ అసిస్టెంట్ సర్జన్‌లకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈ శిక్షణలో రోజుకు 35 నుంచి 40 మంది వరకు పశు వైద్యులకు బ్యాచ్‌లవారీగా శిక్షణ ఇచ్చారు. పాడి పశువులకు ఆధునిక పోషణ పద్ధతులు, వాటి ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంచడం, పాడి రైతులకు ఆదాయం పెంచే చర్యలు తదితర అంశాలను అధికారులు వివరించారు. దీంతో పాటు పశు వైద్యులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్మైల్ అదనపు డైరెక్టర్ సింహాచలం మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు ఇక్కడ 1,117 మంది పశు వైద్యులకు, 80 మంది సన్న జీవాల వ్యవస్థాపకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విశాఖ, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతి, అనంతపురం ప్రాంతీయ శిక్షణ కేంద్రాలలో వైద్యులకు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణలో తెలుసుకొన్న అంశాలు, ఆధునిక పద్ధతులను గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పాడి రైతులు డెయిరీ ఫారాలు ఏర్పాటు చేసుకోవడానికి, డెయిరీలలో ఎక్కువ సంఖ్యలో పశువులు ఉండే విధంగా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. పాల ఉత్పత్తి పెంచే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతులకు ప్రోటీన్‌లతో కూడిన దానా అందించే చర్యలు చేపడుతున్నామన్నారు. ముగింపు కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మురళీధర్, చక్రవర్తి, రమణయ్య, సుధాకర్, ప్రసాదరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, చలపతిరావు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

గ్లోబల్ లీడర్స్‌గా ఎదగాలి



నవీందర్‌ను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: యువతరం గ్లోబల్ లీడర్స్‌గా ఎదగాలని లండన్‌కు చెందిన మేనేజ్‌మెంట్ నిపుణుడు నవీందర్ ఆకాంక్షించారు. బుధవారం ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఎంబీఏ విద్యార్థులను ఉద్దేశించి కన్సల్టింగ్ సర్వీసెస్‌కు అవసరమైన నైపుణ్యాలపై ఆయన ప్రత్యేక అతిథి ప్రసంగం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా విభిన్న దేశాలలో తాను అందిస్తున్న కన్సల్టింగ్ సేవలు, విధి విధానాలు, పనితీరు, ప్రగతి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సాధారణ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలతో పాటు, ఐటీ ఆధారిత సేవలు, ఆర్థిక సేవలు అందించే అంశాలపై కార్యాచరణ రూపొందించుకుని పని చేయడంపై వివరించారు. ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉందన్నారు. ఏయూ జియోఫిజిక్స్ ఆచార్యుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఎంబీఏ చేసిన నవీందర్ కప్లిష్ ఏయూ విద్యార్థులకు పలు అంశాల్లో దిశానిర్దేశం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని నవీందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఏయూ విద్యార్థులకు నూతన జ్ఞానాన్ని అందించే దిశగా సహకారం అందించాలని వీసీ కోరారు. వర్సిటీతో కలసి పని చేయాలని సూచించారు. వర్సిటీ తరఫున నవీందర్‌ను సత్కరించారు.

వ్యక్తి అదృశ్యం



బొజ్జ ప్రసాద్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసునమోదైంది. వివరాలు.. కప్పరాడ సమీపంలో రాంజీ ఎస్టేట్‌కు చెందిన బొజ్జ ప్రసాద్ (40) ఈ నెల 20 మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని అతని సోదరుడు బొజ్జ వెంకట రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రసాద్‌కు ఊర్వశి కూడలి వద్ద ఆటోమొబైల్ షాపు ఉంది. రోజూ మాదిరిగానే ఉదయాన్నే షాపునకు వెళ్లాడు. మధ్యాహ్నం ప్రసాద్ తండ్రి భోజనం ఇవ్వడానికి షాపు దగ్గరకు వెళితే షాపు మూసి ఉంది. అప్పటి నుంచి ప్రసాద్ కనిపించడం లేదు. దీంతో ప్రసాద్ సోదరుడు రమేష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న నాయకులు రాము, బోకం శ్రీనివాసరావు



పోటీలను ప్రారంభిస్తున్న బోకం రామునాయుడు తదితరులు

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెంలో శ్రీపరదేశిమాంబ పండగ సందర్భంగా నిర్వహిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభయ్యాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ నాయకుడు బోకం రామునాయుడు, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము ప్రారంభించారు. పోటీల్లో విశాఖ,విజయనగరం,అనకాపల్లి జిల్లాల నుంచి సుమారు 60 జట్లు పాల్గొన్నాయి. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసుగా రూ.12 వేలు, రూ.10 వేలు,రూ.8 వేలు, రూ.6 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోకం స్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, పారిశ్రామిక వేత్త బోకం శ్రీనివాసరావు, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం కాసు బాబు, మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, సచివాలయ కన్వీనర్ బోకం నాగేశ్వరరావు,ఉపసర్పంచ్ వనం దేముడు పాల్గొన్నారు.

విశాఖ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా శివరామకృష్ణ

బీచ్ రోడ్డు: విశాఖ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడిగా శివరామకృష్ణ ఎన్నికయ్యారు. బుధవారం సిరిపురంలోని ఓ హోటల్‌లో సొసైటీ నూతన కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కోశాధికారిగా వరప్రసాద్, డైరెక్టర్లుగా మరడ పోలిరెడ్డి, అనీల్‌కుమార్, కృష్ణ, అప్పలరాజు, మహేశ్వరరావు, ఈశ్వరరావును ఎన్నుకున్నారు. ఐదేళ్ల పాటు ఈ పాలక మండలి కొనసాగనుంది. ఎన్నికల అధికారిగా సిహెచ్.ఎస్.శ్రీనివాసరావు వ్యవహరించారు.

కళాభారతిలో రామదాసు జయంతి నేడు

మద్దిలపాలెం: భక్త రామదాసు జయంతి వేడుకలను గురువారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలలో భాగంగా సాయంత్రం 6.30 గంటలకు భక్త రామదాసు కీర్తనల గోష్టి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సుమారు 200 మంది కళాకారులు పాల్గొన్ని గీతాలాపన చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

కార్మికుల భవిష్యత్తు అంధకారం



741వ రోజు దీక్షలో పాల్గొన్న బ్లాస్ట్‌ఫర్నేస్ కార్మికులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేస్తూ, కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో 741వ రోజు, బుధవారం సంస్థకు చెందిన బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. కార్మికులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇస్తే కార్మికుల భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి తగిన గుణపాఠం నేర్పుతారని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



కాలనీ నిర్వాసితులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు చింతలగ్రహారం పరిధిలోని గవరపాలెంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు బుధవారం పర్యటించారు. కాలనీ నిర్వాసితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. డ్రైనేజీలు, ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ముమ్మన హామీ ఇచ్చారు. వార్డులోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాని చెప్పారు. కార్యక్రమంలో 501 సచివాలయ కన్వీనర్ కాళ్ల సురేష్, డీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో పైడపునాయుడు

సింహాచలం: వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని పెందుర్తి ఎంఈవో పైడపునాయుడు ఉపాధ్యాయులకు సూచించారు. పెందుర్తి మండలం గొల్లవిల్లిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, ఉపాధ్యాయుల లెసెన్ ప్లాన్, టీచింగ్ డైరీ రికార్డులు తనిఖీలు చేశారు. 5వ తరగతి విద్యార్థుల తెలుగు, ఆంగ్లం, గణిత సబ్జెక్టుల్లో సామర్థ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా వెనుకబడిన విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచడానికి కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ జి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి

ఆరిలోవ: హనుమంతవాక వద్ద విజయ దుర్గా కాలనీలోని విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ నెల 20న ప్రారంభమైన ఈ ఉత్సవాలు ముగింపు సందర్భంగా అమ్మవారికి ఉ దయం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు సాయంత్రం అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో భాగంగా నిర్వహించిన జాతరలో హనుమంతవాక నుంచి పెదగదిలి వరకు ప్రజలు తరలివచ్చి సందడి చేశారు. మూడు రోజుల పాటు ప్రశాంతంగా ఉత్సవాల నిర్వహణకు సహకరించిన కాలనీవాసులకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

25న ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు

సింధియా: భారత ప్రభుత్వం స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్ (సెమ్స్) ఆధ్వర్యంలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సహకారంతో పోర్టు ఇంజినీరింగ్, డిప్లమో, ఇంటర్ డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నామని సెమ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సేతు మాధవన్ తెలిపారు. పోర్టు కళావాణి ఆడిటోరియంలో ఈ నెల 25న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇంజినీరింగ్ యువతకు, మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ఇంటర్, డిగ్రీ మరియు డిప్లమో పూర్తి చేసిన యువతకు ఉద్యోగ అవకాశాలపై ఇచ్చే సదస్సును యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సుకు అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు, శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారులు, తల్లిదండ్రులు,విద్యార్థులు రావచ్చునని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగులు 9948183865, 7794840934 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్షణ



హెల్మెట్ ధరించాలని సూచిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్

సింహాచలం: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, తద్వారా సురక్షిత ప్రయాణం సాగించవచ్చునని పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ ద్విచక్ర వాహనదారులకు సూచించారు. పెందుర్తిలో బుధవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. 2022లో హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో 147 మంది మృతి చెందారని వివరించారు. చిన్న పొరపాటు జీవితాన్ని అంధకారంలోకి నెట్టివేస్తుందన్నారు. కుటుంబ సభ్యులు కూడా తమ వారికి హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలని సూచించారు.

గాంధేయ విలువలతో సుస్థిర ఆర్థికాభివృద్ధి



రోషిణికి గాంధీజీ పుస్తకాలను బహూకరిస్తున్న చల్లా రామకృష్ణ

ఏయూ క్యాంపస్: సుస్థిర ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి సాధనకు గాంధేయ విలువలు, విధానాలు అవసరమని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కొరటి అన్నారు. బుధవారం ఆంధ్రా యూనివర్సిటీ గాంధీయన్ స్టడీస్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. సాంఘిక సంక్షేమంపై గాంధేయ ఆలోచనలు ఆమోదించిన స్వదేశీ మార్కెట్‌లు సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని రోషిణి చెప్పారు. సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ గాంధీజీ పుస్తకాలను ఆమెకు బహూకరించారు. కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన స్వరార్చన



పాటలు ఆలపిస్తున్న గాయకులు

సీతంపేట: స్వరార్చన, యునైటెడ్ సింగర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పౌరగ్రంథాలయంలో ఇటీవల పరమపదించిన సినీ దిగ్గజాలు కృష్ణ, కృష్ణంరాజు, జమున, కె.విశ్వనాథ్, వాణీ జయరామ్‌లకు స్వరార్చనతో నివాళులు అర్పించారు. గాయనీ గాయకులు భూపతిరావు, ఎన్.రాజేశ్వరి, బాబ్జి, భాగ్యలక్ష్మి, కృషరాజు, కల్యాణి, వెంకట్, సాత్విక సినీ దిగ్గజాల హిట్ సాంగ్స్ పాడి అలరించారు. వీరికి కీ బోర్డుపై సోమేష్, తబలాపై చలం, ప్యాడ్స్‌పై బాబ్జి చక్కని సంగీతం అందజేశారు. ముందుగా సంఘం గౌరవాధ్యక్షులు కొణతాల రాజు, ఘంటసాల క్రీడా సాంస్కృతిక సంఘం వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, స్వర మాధుర్యం అధ్యక్షులు ఎం.వి.ఆర్.నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు పుండరీ కుమార్, మెలోడి సత్యనారాయణ, ఫణి భూషణ్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



సీతమ్మధార రైతుబజారులో ఆర్గానిక్ స్టాల్‌లో కందిపప్పు పరిశీలిస్తున్న యాసిన్

సీతమ్మధార : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ హెచ్చరించారు. బుధవారం సీతమ్మధార రైతుబజారును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా బజారులో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ స్టాల్‌ను పరిశీలించారు. ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. రైతుబజారు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. రైతుల స్టాల్స్ వద్దకు వెళ్లి ఐడీ కార్డులు పరిశీలించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఎస్టేట్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ రైతుబజారులో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాల్స్ డ్రా తీసినప్పుడు తేడా లేకుండా చూడాలన్నారు. ప్రతి పదిరోజులకొకసారి స్టాల్స్ డ్రా తీయాలన్నారు. స్టాల్స్‌లో ఎవరైనా బినామీలుంటే సహించేది లేదన్నారు. దీనికి పూర్తిగా ఎస్టేట్ ఆఫీసర్లే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

నగర సుందరీకరణ పనుల పరిశీలన



ఎన్‌ఏడీ జంక్షన్ వద్ద టాయిలెట్ల ఏర్పాటును పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు

గోపాలపట్నం : వచ్చే నెలలో జీ-20 సదస్సు జరగనున్న నేపథ్యంలో జాతీయ రహదారిలో జరుగుతున్న సుందరీకరణ పనులను జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు బుధవారం పరిశీలించారు. ఎయిర్ పోర్టు జంక్షన్ నుంచి గ్రీన్ బెల్ట్ వరకు పరిస్థితి ఇంకా మెరుగుపడాలని, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫుట్‌పాత్‌లకు రంగులు వేసే పనులు త్వరతగతిన చేయాలని ఆదేశించారు. గ్రీన్ బెల్టు ఫెన్సింగ్ బాగు చేయాలని, వృథాగా ఉన్న కేబుల్ తీగలు తొలగించాలన్నారు. చాలా చోట్ల నిరుపయోగంగా ఉన్న సైన్ బోర్డులు తొలగించాలని సూచించారు. గ్రీన్ బెల్టులో వ్యర్థాలు ఉండడాన్ని గమనించి వాటిని తొలగించాలని సూచించారు. విమాననగర్ జంక్షన్ వద్ద నిరుపయోగంగా ఉన్న బస్ స్టాపులను ఆధునికీకరించాలని ఆదేశించారు. అలాగే వంటిల్లు సమీపంలో ఉన్న పాత బస్‌స్టాపులను పూర్తిగా తొలగించి ఆ స్థానంలో టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనులు సత్వరం పూర్తి చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఏడీసీ సన్యాసిరావు, సీసీపీ సురేష్, డీడీహెచ్ దామోదర్, ఎస్‌ఈలు రామ్మోహన్, వేణుగోపాలరావు, డీసీపీ రత్నకుమార్, జోన్-5 జెడ్సీ కృష్ణ, జోన్-8 జెడ్సీ మల్లయ్య నాయుడు, ఏసీపీ రమణ మూర్తి, ఈఈ సంతోషి కుమారి, జోన్-5 ఏఎంహెచ్‌వో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.